అడవిని తలపిస్తున్న చెరువులు

- పిచ్చి మొక్కలతో నిండిపోయిన వైనం
- తగ్గుతున్న నీటి నిల్వ సామర్థ్యం
- పట్టించుకోని అధికారయంత్రాంగం
- ప్రశ్నార్థకంగా మారుతున్న ఆయకట్టు సాగు

సి.బెళగల్: రైతన్నకు సాగు కష్టాలు తప్పడం లేదు. వ్యవసాయం చేసేందుకు జంకుతున్నారు. సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న రైతన్నకు టీడీపీ ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించకుండా మొండి చెయ్యి చూపడంతో అయోమయానికి గురవుతున్నారు. ప్రత్యేకించి సి.బెళగలమండలంలో చెరువులు అధ్వానంగా మారాయి. దీంతో ఆయకట్టుతోపాటు మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం సి.బెళగల్‌తోపాటు పలుకుదొడ్డి, బ్రాహ్మణదొడ్డి చెరువులు ఆడవిని తలపిస్తున్నాయి. పిచ్చిమొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరిగిపోయాయి. చెరువా, అడవినా అనే పరిస్థితి నెలకొంది. ఈ చెరువుల కింద దాదాపు 463 ఎకరాల ఆయకట్టు ఉంది. సాగనీరు అందక ఇబ్బందులు పడుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలువలు సైతం కుదించుకపోయాయి. గట్లపై కంపచెట్లు పెరిగి కాలువలు కనిపించని పరిస్థితి. సి. బెళగల్ చెరువు మండలంలోనే పెద్దది. చెరువు పరిధిలో దాదాపు 358 ఎకరాలు సాగు చేస్తారు. గతంలో రెండుకార్లు వరి పండించే రైతులు ప్రస్తుతం ఒకసారికే ఇబ్బందులు పడుతున్నారు. చివరి ఆయకట్టు పరిస్థితి మరీ అధ్వానం. పిచ్చిమొక్కలు, పూడికి నిండి చెరువు నీటి సామర్థం తగ్గింది. వర్షాలు లేక ఈ మూడు చెరువులు దాదాపు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది.


బ్రాహ్మణదొడ్డి చెరువులో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు


పలుకుదొడ్డి చెరువులో పెరిగిన ముళ్లపొదలు


సి.బెళగల్ చెరువులో వ్యాపించిన రబ్బరు చెట్లు

మత్స్యకారులకు తప్పని ఇబ్బందులు

మండలంలోని సి.బెళగల్, పలుకుదొడ్డి, బ్రాహ్మణదొడ్డి చెరువుల ఆయకట్టుతోపాటు మత్స్యకారులకూ ఇబ్బందులు తప్పడం లేదు. దాదాపు వెయ్యి మత్స్యకారుల కుటుంబాలు ఈ చెరువులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే చెరువులలో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో ఎదుగుదల సరిగా లేదు. దీంతో నష్టపోతున్నామని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, సంబంధిత అధికారులు స్పందించి చెరువులను కప్పేసిన పిచ్చిమొక్కులు తొలగించాలని కోరుతున్నారు మత్స్యకారులు.

సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



చెరువులలో పిచ్చి మొక్కల విస్తరిస్తున్నాయి. పిచ్చిమొక్కల గురించి రైతుల నుంచి ఫిర్యాదులు ఉన్నాయి. పంటలు సాగు చేసే రైతులకు, మత్స్యకారులకు కొంత సమస్య ఉన్నది వాస్తవమే. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సమస్య పరిష్కారానికి తమవంతు కృషి చేస్తున్నాం.

– ధర్మేంద్ర, ఇరిగేషన్ (ఎంఐ) ఏఈ

మండంలో చెరువుల ఇలా...

గ్రామం	చెరువు విస్తీర్ణం	సాగు భూమి (ఎకరాలలో)
సి.బెళగల్	1,943	353
పలుకుదొడ్డి	400	58
బ్రాహ్మణదొడ్డి	44	52
మొత్తం	2,387	463

చేపలు పెంచలేకపోతున్నాం



సి.బెళగల్ చెరువులో ప్రతి సంవత్సరం లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి చేపల పెంపకం చేపడుతున్నాం. అయితే చెరువులో రబ్బరు చెట్లు (పిచ్చి మొక్కలు) పెరిగిపోతున్నాయి. మేము వదిలిన చేపల ఎదుగుదల సరిగ్గాలేదు. చాలా ఇబ్బందిగా ఉంది. గతంలో మత్స్యకారులు కలిసి చెరువులో రెండు సార్లు కొంతమేర ముళ్ల పొదలను తొలగించుకున్నాం. అధికారులు స్పందించి చెట్లను తొలగింపు చర్యలు తీసుకోవాలి.

– తెలుగు సుంకన్న, మత్స్యకారుల సంఘం సభ్యుడు, సి.బెళగల్

సాగు కష్టంగా మారింది



సి.బెళగల్‌లోని చెరువు నీటితో రెండు సార్లు వరిమళ్ల పంటడేవి. ఇప్పుడు చెరువులో పిచ్చి మొక్కలు ఎక్కువగా పెరిగడంతో నీటి నిల్వ సామర్థ్యం తక్కువైంది. ఒక్క పంటను పండించడం కూడా కష్టంగా మారింది. కంపచెట్లు, రబ్బరు చెట్లను తొలగించి తూములకు నీళ్లు ఎక్కేలా పనులు చేపట్టాలి.

– బలిగేరి వెంకటేష్, సి.బెళగల్ రైతు

రైతుల సమస్యలపై స్పందించాలి



రైతుల సమస్యలను ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చెరువులు పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. పూడికి ఎ క్కువ అయ్యింది. అధికారులు స్పందించి పరిష్కార చర్యలు తీసుకోవాలి.

– వరపుత్ర గౌడ్, చెరువు ఆయకట్టురైతు, బ్రాహ్మణదొడ్డి గ్రామం

క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి



పాణ్యం: పాణ్యం సర్కిల్ సీఐగా కిరణ్ కుమార్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీఐ విలేకరులతో మాట్లాడుతూ పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలోని పోలీసులు సీఐని కలిసి అభినందనలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి

పాణ్యం ఎస్ఐగా నరేంద్రకుమార్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్నూలు జిల్లా కౌతాళం మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న అశోక్ బేతంచెర్లకు బదిలీ అయ్యారు.

కంబదహాల్లో ఆలయ ప్రతిష్ట ఉత్సవాలు


హోమం నిర్వహిస్తున్న పూజారులు

సి.బెళగల్: మండల పరిధిలోని కంబదహాల్ శివారులో ఉన్న బీరప్ప స్వామి నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పురోహితులు నరసింహంహరావు పండిత బృందం సభ్యులు గణపతి పూజ నిర్వహించారు. అదేవిధంగా పుణ్యాహ వాచనం, మాతృకాపూజ, రక్షా బంధనం, మహాయాగ మంటప ప్రవేశం, షోడశస్తంభపూజలు, కళశ స్థాపన తదిత పూజలు చేశారు. సాయంత్రం అంకురారోపణం, అగ్నిప్రతిష్ట, దీక్షాహోమం నిర్వహించారు.

ఈ- పంట నమోదు చేయించుకోండి


గని గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ హేమసుందర్‌రెడ్డి

గడివేముల: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పైరుకు ఈ-పంట నమోదు చేయించుకోవాలని ఏఓ హేమసుందర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఒండుట్ల, గని, ఎల్‌కే తాండ, మంచాలకట్ట గ్రామాల్లో జరుగుతున్న ఈ- పంట నమోదును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ సాగు చేసిన ప్రతి పంటకు సంబంధించిన పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ పాసుపుస్తకంతో పాటు పాస్‌ఫొటోను రైతుభరోసా కేంద్రాల్లో అందజేయాలన్నారు. ఈ మేరకు ఆర్బీకే సిబ్బంది రైతు పొలం వద్దకు వచ్చి ఈ-పంట నమోదు చేస్తారన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ సునీల్ కుమార్



ఓర్వకల్లు : ఓర్వకల్లు ఎస్ఐగా సునీల్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ రాజారెడ్డి అవుకు పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. ఈ మేరకు వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ సునిల్‌కుమార్ ఇక్కడికి బదిలీ అయ్యారు.

సన్మానం


శివరామిరెడ్డిని సన్మానం చేస్తున్న

గడివేముల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గడివేముల ఎంపీడీఓ విధులు నిర్వర్తించిన శివరాంరెడ్డి సొంత జిల్లా కడపకు బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయనను ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, ఎంపీటీసీ మహేష్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏఓ చంద్రశేఖర్, మండల కో-ఆర్డినేటర్ గఫూర్ పాల్గొన్నారు.

నేడు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

సి.బెళగల్: మండలంలోని నాలుగు పాఠశాలలో శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తున్నామని ఎంఈఓ జ్యోతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తకోట, పోలకల్, సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గుండ్రేవుల ప్రాథమికోన్నత పాఠశాలలో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశాలకు అన్ని పాఠశాలల నుంచి 50 శాతం ఉపాధ్యాయులు హాజరు కావాలని ఎంఈఓ ఆదేశించారు. సమావేశంలో తెలుగు, గణితం, జీవశాస్త్రం అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఉంటుందన్నారు.

చిరస్మరణీయుడు కోట్ల విజయభాస్కరరెడ్డి


కోట్ల విజయ భాస్కరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు


కిసాన్ ఘాట్‌లో కోట్ల సమాధికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కోడుమూరు రూరల్: పేదల సంక్షేమం కోసం కృషి చేసి ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడుగా దివంగత ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి నిలిచిపోయారని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం కోడుమూరులో కోట్ల విజయభాస్కరరెడ్డి 104వ జయంతిని నిర్వహించారు. కోట్ల సర్కిల్‌లోని కోట్ల విగ్రహానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేసి పూల మాళలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యరత్న, టీడీపీ మండల కన్వీనర్ కోట్ల కవితమ్మ, మాజీ సర్పంచ్‌లు సీబీ లత, కేఈ రాంబాబు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు హేమాద్రిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాయకులు కోట్ల కౌశిక్ రెడ్డి, ముడుమలగుర్తి విష్ణువర్ధన్ రెడ్డి, గోరంట్ల తిరుమలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: దివంగత ముఖ్యమంత్రి కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి జయంతి సందర్భంగా శుక్రవారం కర్నూలులోని కిసాన్ ఘాట్‌లో ఆయన సమాధికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఎ. వెంకటస్వామి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి


రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ సాలురెడ్డి

కోడుమూరు రూరల్: రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి సూచించారు. గూడూరులో ఏఓ శ్రీవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ పంటలపై రైతులకు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఏడీఏ సాలురెడ్డ హాజరై పొలంబడి ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పొలంబడి ద్వారా ఏయే పంటలు సాగు చేసుకోవచ్చు, ఏ భూములకు ఏ పంటల సరిపోతాయి, పంటలకు తెగుళ్లు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకోవచ్చునన్నారు. ప్రతి రైతు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్నారు. ముఖ్యంగా పంట మార్పిడి, అధిక ఉత్పత్తి వంగడాల సాగుతో లాభాలను ఆర్జించవచ్చునని సూచించారు.

ప్రశాంత జీవనం అలవర్చుకోవాలి


లద్దగిరి ప్రజలతో మాట్లాడుతున్న కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు

కోడుమూరు రూరల్ : ప్రతిఒక్కరూ ప్రశాంత జీవనం అలవర్చుకోవాలని, గొడవలకు దూరంగా ఉండాలని కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. మండల పరిధిలోని లద్దగిరి గ్రామాన్ని శుక్రవారం ఎస్ఐ పర్యటించారు. ప్రజలతో ఎస్ఐ మాట్లాడారు. ఘర్షణలకు పాల్పడొద్దని, ఏదైనా సమస్య తలెత్తినప్పుడు గ్రామ పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని సూచించారు. అప్పటికీ సమస్యకు పరిష్కారం లభించకపోతే పోలీసులను ఆశ్రయించాలని చెప్పారు. అనుమానితులు గ్రామాల్లో సంచరిస్తున్నా, అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడుతున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గొడవల మూలంగా కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయనే విషయాన్ని తెలుసుకుని మసలుకోవాలని సూచించారు. ముఖ్యంగా సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లేని పక్షంలో తీవ్రంగా నష్టపోతారని ఎస్ఐ హెచ్చరించారు.

సర్వర్ సతాయింపు!


కోడుమూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ముందు నిరీక్షిస్తున్న ప్రజలు

కోడుమూరు రూరల్: సర్వర్ పనిచేయకపోవడంతో కోడుమూరులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సేవలు నిలిచిపోయాయి. శుక్రవారం ఉదయం నుంచి సర్వర్ కొద్దిసేపు పనిచేసిన తర్వాత మొరాయించింది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు సంబంధించి అమ్మకం, కొనుగోలుదారుల ఈకేవైసీ తీసుకుంటున్నప్పటికీ ఈసైన్ రావడం లేదు. దీంతో వారికి నిరీక్షణ తప్పడం లేదు. 14వతేదీన సైతం ఇదేపరిస్థితి నెలకొంది. దీంతో స్థలాలు, పొలాల రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ప్రజలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పడిగాపులు కాస్తున్నారు. ఈకేవైసీ తీసుకుని ఈసైన్ రాకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను సబ్ రిజిస్ట్రార్ మహబూబ్‌బాషా దృష్టికి తీసుకెళ్లిగా సానుకూలంగా స్పందించారు. సర్వర్ సమస్య ఉన్నది వాస్తవేమని, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.


అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం


వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈఓ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన వరలక్ష్మీ వ్రతానికి కొత్తూరుతోపాటు సమీప గ్రామాల మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. మహిళలకు దేవస్థానం వారు ఉచితంగా టెంకాయ, పసుపు, కుంకుమ, పూలు, జాకెట్ క్లాత్‌పాటు గాజులు అందించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

ఓర్వకల్లు : శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమి ముందు వచ్చే వరలక్ష్మీ వ్రతాన్ని మండలంలోని ప్రజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే తల స్నానం ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి అమ్మవారిని కలశంలోకి ఆవాహన చేసి వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. అష్టోత్తర శతమానాలతో వరలక్ష్మీదేవిని పూజించి షడ్రషోపేతమైన మహా నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇంట్లో ఉన్న సమస్యలను తొలగించి కుటుంబాన్ని కాపాడాలని మహిళలు అమ్మవారిని వేడుకున్నారు. పున్నమి చంద్రుడు శ్రవణ నక్షత్రంలో సంచరించడం వల్లే ఈ శ్రావణమాసానికి ఇంతటి విశిష్టత ఉందని జంధ్యాల మనోహర్ శర్మ తెలిపారు.

భోగేశ్వరంలో శ్రావణమాస ప్రత్యేక పూజలు

గడివేముల: మండలంలో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రంలో భోగేశ్వరస్వామివార్లకు శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శ్యాంసుందర్ శర్మ, గిరినాధశర్మల ఆధ్వర్యంలో ముందుగా గణపతి పూజ, పుణ్యహావాచనం, అలంకార పూజ చేశారు. స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులకు స్వామి,అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు


హోమం చేస్తున్న భక్తులు

దేశాభివృద్ధికి పాటుపడాలి


డిగ్రీ పట్టాలు తీసుకున్న విద్యార్థులతో చెర్మన్ శాంతిరాముడు

పాణ్యం: ఆర్థికంగా స్థిరపడిన విద్యార్థులు దేశాభివృద్ధికి పాటుపడాలని పూనే కళాశాల ఆఫ్ ఫార్మసీ భారతీయ విద్యా పీఠం ప్రిన్సిపాల్ ఆత్మరామ్ పవర్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఫార్మసీ కళాశాలలో సమర్థన-2024 నాల్గవ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు ఆసక్తికర విషయాలు నేర్చుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కష్టపడి చదివి తల్లిండ్రులకు అండగా నిలవాలన్నారు. ఇండియాలో 20వ ర్యాంక్ సాధించిన తరుణ్‌కుమార్‌కు కళాశాల చెర్మన్ శాంతిరాముడు రూ. 10వేలు బహుమతిగా అందించారు. ఎం ఫార్మసీ, బీ ఫార్మసీ డిగ్రీ పట్టాలు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుతులుఅందించారు. కార్యక్రమంలో నైపర్ బయోలాజికల్ హెచ్ఓడీ చంద్రగౌడుగు, డీన్ అశోక్ కుమార్, ప్రిన్సిపాల్ మధుసూదనశెట్టి పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయించండి


పెద్దపాడు వక్కెర వాగు బ్రిడ్జిపై గుంతలు చూపిస్తున్న నాయకులు

కల్లూరు: కర్నూలు నగరం వై జంక్షన్ నుంచి పెద్దపాడు గ్రామం వక్కెర వాగు బ్రిడ్జి వరకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, కనీసం మరమ్మతులు చేయించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పుల్లారెడ్డి, నాగరాజు డిమాండ్ చేశారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం, శివారు కాలనీల అసోసియేషన్ నాయకులు కర్నూలు వై జంక్షన్ నుండి పెద్దపాడు వక్కెర వాగు బ్రిడ్జి వరకు పర్యటించారు. అడుగడుగునా గుంతలు పడిని రోడ్డును చూపుతూ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ వక్కెరవాగు బ్రిడ్జి అధ్వానంగా మారిందని, అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. వేరోస్ గోడౌన్ సమీపంలో రోడ్డుపై విద్యుత్ ట్రాన్స్ ఫారాన్ని తొలగించకుండా ఇరుకైన రోడ్లు, ట్రాఫిక్ డివైడర్ నిర్మించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్లకు మరమ్మతులు చేయించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సుకుమార్, సూర్య శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గేట్ మూసివేత

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం వద్ద ఉన్న 172 రైల్వేగేట్‌ను శనివారం మూసివేస్తున్నట్లు తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. డబుల్‌లైన్ పనులు జరుగుతున్నందున ఉదయం7 నుంచి సాయంత్రం 7గంటల వరకు మూసి వేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. ప్రత్యామ్నయంగా బనగానపల్లె రోడ్డులో ఉన్న గేటును ఉపయోగించుకోవాలని కోరారు.